# మనిషి కాటు

వెలుగు ఓటమిని ఒప్పుకుంటున్న వేళ.

విజయగర్వంతో చీకటి, రెక్కలు విప్పుకుంటున్న వేళ.

రోడ్డుని వెనక్కి జారవిడుచుకొంటూ, ఇరువైపులా వున్న సరివి చెట్లను నెట్టుకొంటూ-శరవేగంతో దూసుకు పోతోంది జీపు. టైము చూసుకున్నాడు వెనుక సీట్లో కూర్చున్న మూర్తి. చిన్న ముల్లు ఆరు మీద, పెద్దముల్లు పన్నెండు మీదా, నిలువు గీతలా, వున్నాయి.

రియర్‌వ్యూ మిర్రర్‌లోంచి మూర్తి టైము చూసుకోవటం గమనించిన డ్రైవర్ చెప్పాడు.

''ఇవాల్టికి ఇక్కడే 'హాల్ట్' చెయ్యాలి సార్. ఇక్కడ కాకుంటే ఖర్గపూర్ చేరాకగానీ ఏమీ సదుపాయం వుండదు...''

వెనుకనుంచి సైడుకోసం హారన్ మోగిస్తున్న లారీకి దారిచ్చి కంటిన్యూ చేశాడు.

''ఖర్గ్‌పూర్ పదిగంటలకల్లా చేరుకోవచ్చు, గానీ బీహారు దాటి బెంగాల్లోకి ప్రవేశించగానే 'లోదాసూలీ' అడివి తగుల్తుంది.

ఒకప్పుడు 'నక్సలైట్ల' స్థావరంగా ఉండిన ఈ ప్రాంతంలో దారిదోపిడీలు ఉధృతం కావటం వల్ల చీకటి పడేక రాకపోకలు నిలిచిపోయాయి...''

అతను చెబుతుండగానే-దూరంగా రోడ్డుపైకి వంగి చూస్తున్న 'ఇండియన్ ఆయిల్' గుండ్రటి బోర్డు కనిపించింధి.

జీపు వేగం తగ్గి రోడ్డు దిగింది.

పెట్రోల్ బంక్‌కు కొద్ది దూరంలో ఓ హోటల్ లాంటి దాని ముందు ఆగింది.

తిమురు పట్టిన కాళ్ళను విదుర్చుకుంటూ దిగాడు మూర్తి.

గాలి చల్లగా తాకింది చెంపల్ని.

''ఆయియే సాబ్! ఆయియే!''ఆహ్వానించాడు నులక మంచంమీద ట్రాన్సిస్టర్ వింటున్న ప్రీతమ్ సింగ్.

'హైవే' ప్రక్క కొండల అంచున ఎప్పుడెవరు నిర్మించారో తెలియదుగానీ, పాడుపడిన ఆ యింటిని నివాస యోగ్యంగామార్చి హోటల్ ప్రారంభించాడు ప్రీతమ్ తండ్రి-బలవీర్.

ముందుకువేసివున్న పాకలో పంజాబీ పద్ధతిలో బంక మన్ను మెత్తిన నడుంఎత్తు పొయ్యిలు-దాని కెదురుగా చెట్టు కింద వరుసగా నులక మంచాలు-మరో పక్క అంచులువిరిగిన నుయ్యీ వున్నాయి.

ఎదురుగా వున్న ఎగుడుదిగుడు నేల ట్రక్కులు నిలుపుకోవడానికి వీలుగా చదును చేయుబడింది.

సంవత్సరం క్రితం బల్‌వీర్ చనిపోయాక, హోటల్ భారాన్ని వహించిన ప్రీతమ్ ఓ టేప్ రికార్డరు. స్పీకర్లూ పెట్టించి కాస్త మోడర్నైజ్ చేశాడు.

హైవే డ్రైవర్లు అక్కడ భోజనాలు చేసి వాల్చిన నులక మంచాలపై రెస్టు తీసుకుంటూ వుంటారు. అప్పుడప్పుడు వచ్చే గవర్నమెంట్ ఉద్యోగుల లాంటి వారికి మాత్రం వెనుక గది గెస్టుహౌస్‌లా ఉపయోగ పడుతుంటుంది.

''సాబ్ ఇవాళ ఇక్కడుంటారు'' డ్రైవర్ ప్రీతమ్ సింగ్‌తో చెప్పాడు.

''బగల్‌కా కమరా సాఫ్‌కర్‌దో బేలా...'' ప్రీతమ్ సింగ్ గొంతు నూతిదగ్గర మొహం కడుక్కుంటున్న మూర్తికి వినిపించింది.

టవల్‌తో మొహం తుడుచుకొని, పాకలోవున్న నులక మంచం మీద 'రిలాక్స్‌డ్'గా కూర్చున్నాడు మూర్తి.

'లీజియే సాబ్!'' గాజుగ్లాసు నిండా పొగలు కక్కుతున్న చిక్కటి టీ అందిచ్చాడు కుర్రాడు.

అరచేతికి గ్లాసు, మొహానికి ఆవిరి, గొంతుక్కి టీ-కలిగిస్తున్న వెచ్చదనం ఆ చల్లటి వాతావరణానికి హాయిని తొడుగుతుంది.



పెట్రొమాక్స్ లైట్‌పై నుండి, పాక మూరుగుండా పాకి, అక్కడ్నుంచి పక్కగదికి మళ్ళాయి అతని చూపులు.

ద్వారం తెరిచివుంది.

దీపం వెలిగించడానికి కాబోలు ఎవరో అగ్గిపుల్ల వెలిగిస్తున్నారు.

చిన్న వెలుగు మళ్ళీ చీకటి.

చివరికి దీపం వెలిగినట్టుంది. చీకటి, గదిలో వస్తువుల వెనుక నక్కింది.

అటు చూస్తున్న మూర్తి చివాల్న లేచాడు.

పడినగ్లాసులోని 'టీ'ని నేల పీల్చుకుంటుంది.

గదిలో మూర్తి బూటుకాలిలో నేలను బాదుతున్నాడు.

'కౌన్?... క్యాహువా?... స్త్రీ అరుపులు.

గదంతా గుడ్డకాలిన వాసన. మంట ఆరిన ఆమె పైట నుంచి తీగెలాగా సాగిన పొగ గాలిలో కలుస్తుంది.

"వెలుగనేది ఎలావుంటుందో తెలీకపోయినా ఇతర్లకు దాన్ని పంచటమే ఆమె దినచర్య సాబ్..." ద్వారం దగ్గర ప్రీతమ్ సింగ్ కంఠం.

"అక్కడికి ఎన్నోసార్లు చెప్పేను-ఈ దీపం వెలిగించే పనిచెయ్యొద్దని" అంటూనే ఆమె ఇటుతిరిగే సరికి" నీ పైట అంటుకుంటే సాబ్ ఆర్పేరు" చెప్పేడు పంజాబీలో.

ఆ మసక వెలుగులో ఆమెమొహం కృతజ్ఞతా భావంతో వెలిగిపోతుంది. అప్రయత్నంగా ఆమె చేతులు రెండూ దగ్గరై వణికేయి.

"సాహెబ్!" అని మాత్రం అనగలిగింది గద్గదమైన ఆమె కంఠం.

పర్లేదన్నట్టు చేత్తో వారించాడు మూర్తి.

దీపం ఎత్తి బీడీ వెలిగించుకుని దమ్ము బిగిస్తూ చెప్పేడు ప్రీతమ్" తల్లి తండ్రులతోపాటు చూపుని కూడా పుట్టుకతోనే పోగొట్టుకున్న అభాగ్యురాలు బేలా. చిన్నప్పటినుంచీ 'బాబా' దగ్గరే పెరిగింది. బాబాకి అన్ని పనుల్లో సహాయంగా వుండేది. అంధత్వం ఆమెకు ఏపనికీ ఆటంకంకాదు."

ఆరిపోతున్న బీడీని బ్రతికెయ్యడానికి గట్టిగా పీల్చుతున్నాడు సింగు.

మూర్తి పరిశీలనగా ఆమెనే చూస్తున్నాడు.

ఓ వైపునుంచి పడుతున్న వెల్తుర్లో ఆమె వొంపులు మరింత వొంపుతిరిగి నిగనిగలాడు తున్నాయి.

పందిర్ని దాటి పైకి పాకే నవపల్లవిత లతలా ఆమె యవ్వనం దుస్తుల్లో ఇమడలేక పోతుంది.

"నెలకోసారన్నా 'లైన్'లో వచ్చే బిల్లా గాడికి ఈమె అంటే ప్రాణం. బేలా చేత ఊ అనిపించు డోలీ తెస్తాను అంటాడు. కానీ ఎందుకో పెళ్ళిమాట ఎత్తితేచాలు



ఇస్సు మంటుంది." పైకి నడుస్తూ చెబుతున్నాడు సింగు.

గుమ్మం దాటుతూ ఓసారి వెనుతిరిగాడు మూర్తి.

లాంతర్ని, మారునించి వేలాడుతున్న హుక్‌కి తగిలిస్తుంది బేలా.

మంచుముక్కలాంటి నిశ్చలమైన ఆమె చీకటి కళ్ళలో జ్యోతుల ప్రతిబింబాలు రెపరెపలాడుతున్నాయి.

*            *            *

అసహనంగా పక్కలు మారుస్తున్నాడు మూర్తి.

అర్ధరాత్రికావస్తున్నా కన్ను మూతబడటం లేదు. కళ్ళ ముందు బేలా అమాయకమైన ముఖం కదులుతోంది.

లేచి సిగరెట్టు ముట్టించుకున్నాడు. రెండు దమ్ములు పీల్చి హేంగర్‌కున్న కోటును లుంగీపైనే వేసుకుని పైకినడిచాడు.

హోటల్ ముందు లగేజ్ లారీలు తపస్సు చేస్తున్న రుషుల్లా వున్నాయి. 'చుప్‌కే చుప్‌కే రాత్ దిన్ ఆసూ బహానా యాద్ హై...' తగ్గు స్వరంలో గులామలీ వినిపిస్తున్నాడు.

హోటల్ వెనుకవైపుకు దారితీశాడు మూర్తి.

బట్టలేని చోట శరీరంపై చల్లని చురకలేస్తుంది గాలి.

నిండు పున్నమి.

వెన్నెల ముసుగులో చెట్లు గుసగుసలాడు కుంటున్నాయి.

దూరంగా కొండల వడిలో, వూరు నిద్రపోతూంది. నదుట చంద్రదిప్పే దిద్దుకున్న ఆకాశం, చెరువులో మొహం చూసుకుని మురిసిపోతుంది.

'టప్'

చెరువులో చందమామ చెదిరింది.

అటుచూశాడు మూర్తి

చెరువు గట్టున కూర్చొని ఎవరో రాళ్ళు రువ్వుతున్నారు.

'కౌన్?' దగ్గరైన మూర్తి అడుగుల చప్పుడుకి అదిరి పడింది ఆకారం.

"నేను బేలా! ఇందాక..."

"ఓహో... మీరా!" అతని వాక్యం పూర్తి కాకుండానే పోల్చుకుని "ఇంత రాత్రి పైకొచ్చారే?" అడిగింది.

"నా ప్రశ్నా అదే. ఇంతరాత్రి పూట ఇక్కడేం చేస్తున్నావ్?"

చెరువులో చేరిన చందమామ మరోసారి చెదిరింది.

"బేలా నువ్వేమీ అనుకోనంటే ఓ మాట..."

"అడగండి"

గుసగుసలు ఆపి నిశ్చలంగా నిల్చున్నాయి చెట్లు.

"ఇందాక సింగు పెళ్ళి మాట ఎత్తినప్పుడు నీ మొహం రంగులు మారటం చూశాను. ఇప్పుడు కూడా ఏవో స్మృతుల్ని నెమరువేసుకుంటున్న భావం నీ మొహం దాచలేక పోతుంది"

"సాబ్!" మోకాళ్ళపై ఆనించి వున్న మొహాన్ని అటు



తిప్పకుంది.

ఆమె చూడలేదని తెలియని ఓ పూల రెమ్మ, ఆమె మొహంపై వూగి వూగి రంగుల్ని వొలకబోసుకుం టుంది.

"సరే! నాతో చెప్పటం ఇష్టం లేకపోతే..."

'నహీ సాబ్! అలాగనకండి' అంటూ మూర్తి వైపు తిరిగింది వెన్నెల్లో ఆమె మొహం చందమామలా వెలిగి పోతుంది. చందమామ చెప్తున్న కథను ఆసక్తిగా వింటు న్నాడు మూర్తి.

*　*　*

"కుహూ!" దూరంగా కోకిల

'ఈ కాలంలో కోకిల కూతా?' విస్మయంగా తల తిప్పింది బేలా.

కుహూ!

ఈసారి చెవి దగ్గర తీయగా. దానితోపాటు రెండు చేతులు ఆమెను చుట్టేశాయి.

'ఓహో మధుబాబా!' అచ్చంగా కోకిల్లానే కూశారు.

"అవును బేలా, నీవు తన జీవితంలోకి వసంతమై నడిచి వచ్చిన పులకరింతతో కూసింది కోకిల" ఆమె జడలో మల్లెల్ని వాసన చూస్తూ అన్నాడు మధు.

"వసంతం మీరే నా జీవితంలోకి తెచ్చారు. మధు బాబూ" బేలా అతని వైపు తిరిగి గుండెల్లో మొహం దాచుకుంది.

'యాక్సిడెంట్'గా ఒకటవ్వడం అన్నది వాళ్ళ జీవితాల్లో అక్షరాలా జరిగింది.

ఆరోజు

హోటల్ ముందు వేగంగా వస్తున్న లారీని జీపు గుద్దు కుంది. జీపు నుంచి పైకి తుళ్ళి పోయిన మధు తలకి గాయమైంది. కాలు ఫ్రాక్చరైంది. జీపు కూడా దారు ణంగా దెబ్బతింది.

హోటల్ ముందున్న బలవీర్ పరుగెత్తికెళ్ళి మధు తలకి టవల్‌తో కట్టుగట్టి మరో లారీలో డాక్టర్ దగ్గరికి తీసుకుపోయేడు.


కాలుకి ప్లాస్టరేసి నెల రోజులు విశ్రాంతి అవసరమన్నాడు డాక్టర్. బలవీర్ తన వెనుక గదిలో మధుకి పడక ఏర్పాటు చేశాడు.

బేలా మధుకి సపర్యలు చేసేది. రెండు మూడు రోజుల్లో కొద్దిగా కోలుకున్నాడు మధు.

తడబాటు లేకుండా పనులు చేసుకుపోయే ఆమె చాక చక్యం, మంచులో తడిసిన మొగ్గలాంటి ఆమె అందం, అతనికి ఆమె పట్ల ఆకర్షణ కలిగించాయి.

ఆమెకు అతని మాటలు వినడానికి ఉత్కంఠగా వుం డేది. అతను ఎన్నో విషయాలు చెప్పేవాడు.

గది కిటికీ లోంచి తొంగి చూస్తున్న సన్నజాజి తీగె గురించి ఆకాశంలో మబ్బుల్తో దాగుడు మూతలాడు తున్న చంద్రుడ్ని గురించి - పచ్చని బారులు తీరి సాగిపోతున్న కొంగల గురించి - నాచు కొలనులో పూచిన తెల్ల కలువ గురించి - పువ్వుల మొహాల్ని ముద్దాడుతున్న సీతాకోకచిలుక రెక్కలపై రంగుల గురించి - అతను చెపుతుంటే ఆమె మనసులో



అస్పష్టంగా గీతలు గీసుకు నేది. ఆ గీతల్లో అందమైన దృశ్యాలు మెదిలేవి.

ఇలా ఆమె చీకటి మనసులో రంగుల ముగ్గులేసిన అతను, ఆమెకు సన్నిహితుడయ్యేడు.

ఓ సాయంత్రం, సన్నజాజుల సుగంధపు నీడలో, అతను ఆమె అందం గురించి చెప్పినప్పుడు మొదట సారిగా ఆమెలో పడుచు ఊహలు విరిసేయి.

పల్లని వెన్నెల్లో అతని వెచ్చటి ఊపిరి మెడను తాకినపుడు ఆమె యవ్వనం ముడివిడిన సిల్కు తెరలా రెప రెప లాడింది. అతని వేళ్ళు ఆమె వొంపులపై పలికించిన అనురాగానికి పరవశం చెంది, తన సర్వస్వాన్ని దోసిట పట్టి అర్పించింది. తూర్పు పడమరల బంతాట మధ్య రోజులు దొర్లిపోయాయి. అతను నెమ్మంగా నడవగలు గుతున్నాడు. రిపేరయిన జీపు పరిగెత్తగలుగుతుంది.

జంటదార్లు వీలిపోయే తరుణం...

"మధు బాబూ!" అంది అతని గుండెకు గుచ్చుకున్న బేలా. బేలా!...చెప్పాగా త్వరలోనే వస్తాను. ఈసారి వచ్చినప్పుడు పూల పల్లకితో వస్తాను. నిన్ను ఏకంగా నా జీవితంలోకి ఎక్కించుకు పోతాను"

మధు ఆమె నుంచి సుతారంగా విడిపించుకుని జీపెక్కాడు. క్రమంగా జీపు చప్పుడు గాల్లో కలిసి పోయింది.

అంతవరకూ ఆమె కనుకొలకుల్లో నిలిచిన ఓ కన్నీటి బొట్టు చరచరా చెక్కిలి పైకి జారింది.

*　*　*

## మా అమ్మ కోరిక

ఓ కుమారిగారు భగవంతుడ్ని ప్రార్థిస్తు న్నారు,

"ఓ... భగవంతుడా నాకుగా నేను ఎప్పుడూ నిన్ను ఏమీ కోరను; మా అమ్మ కోరిక మాత్రం నెరవేర్చు, పాపం ఆమెకు ఓ మంచి అల్లుడు కావాలట!"

— ఇ.వి.రమణ

జారిన కన్నీటి బొట్టు తుడుచుకుంటూ ముగించింది.

"అలా ఆరోజు వెళ్ళిపోయిన మధుబాబు ప్రతి క్షణం నా మదిలో మెదుల్తూనే వున్నాడు. ఇలా అయిదు సంవత్స రాలు గడిచిపోయాయి. ఈ లోపల బాబా చనిపో యాడు..."

భారంగా నిట్టూర్చాడు మూర్తి. అతని మనసులో ఏదో అనుమానం. మరో సిగరెట్టు వెలిగించి గట్టిగా పీల్చి పొగవదిలాడు.

"అతను తిరిగి వస్తాడని నువ్వు ఇంకా నమ్ముతున్నావా బేలా?" సంశయాన్ని బైటపెట్టేడు.

"తప్పకుండా వస్తాడు సాబ్. అతనేదో ఇబ్బందిలో ఇరుక్కుని వుంటాడు..." ఆమె కంఠంలో అపనమ్మ కం ఏ మాత్రం లేదు.

ఓ క్షణం తరువాత మళ్ళీ ఆమే అంది "సాబ్! అతను వెళ్ళే ముందు అడ్రస్ తీసుకున్నాను. దాన్ని ఇంతవరకు ఎవరికీ చూపించలేదు. మీరు అతనికో ఉత్తరం రాసి పెట్టరూ?"

మూర్తి ఒప్పుకున్న పది నిమిషాల్లో ఆమె చేతిలో ఓ కాగితంతో ప్రత్యక్షమైంది.

దాన్ని విప్పి చూసిన మూర్తి మొహం తెల్లగా పాలిపో యింది.

*　*　*

టైమయిందన్నట్టు డ్రైవర్ జీప్ హారన్ మోగించాడు. ప్రీతమ్ సింగ్ తిరిగిచ్చిన చిల్లర నోట్లని కోటు జేబులో కుక్కుకుంటుండగా కాగితం తగిలింది.

రాత్రి బేలా, అడ్రస్ అంటూ యిచ్చిన కాగితంలో ఏవో పిచ్చి గీతలు తప్ప ఒక్క అక్షరం కూడా లేదు.

'సరే' అంటూ కాగితాన్ని కోటు జేబులో పెట్టుకు న్నాడు. రెండోసారి జీపు గీ పెట్టింది.

తేరుకున్న మూర్తి, గదిలోకెళ్ళి సూట్‌కేస్ అందు కున్నాడు. బేలా బత్తాయి పండుతో వచ్చింది.

"బేలా!...వస్తాను. నీవు చెప్పినట్టుగానే వుత్తరం రాసి స్వయంగా నేనే పోస్ట్ చేస్తాను"పండు అందుకుంటూ చెప్పేడు.

"బహుత్ మెహరబానీ సాబ్" చేతులు జోడించింది.

నాలుగడుగులు వేసిన మూర్తి చటుక్కున వెనుతిరిగాడు.

"బేలా నువ్వు చూడలేదు కదా మధును ఎలా గుర్తు పట్టగలవ్?"

"గొంతు... వేణువులోంచి పలికినట్టుగా తీయని గొంతు... కోటి కంఠాల మధ్యనైనా..." ఆమె పరవ శంగా చెప్పుకుపోతోంది.

జీపెక్కి సూట్‌కేస్ వడిలో పెట్టుకుని 'పోనియ్' అన్నాడు మూర్తి.

ఇప్పుడతని గొంతు... వేణువులోంచి పలికినట్టుగా తీయగా వుంది.

జీపులోకి పడుతున్న లే ఎండలో సూట్ కేసు మీద అంటించిన గోల్డెన్ నేమ్ స్టిక్కర్ మిలమిలలాడుతుంది.

"మధుమూర్తి. మిమిక్రీ ఆర్టిస్ట్"